క్లుప్తంగా

సాంకేతికతపై పట్టు సాధించాలి

డీఈఓ తాహెరా సుల్తానా



కంకిపాడు: సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని డీఈఓ తాహెరా సుల్తానా సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ట్యాబ్‌లో బైజూస్ యాప్ వినియోగం, పాఠ్యాంశాల్లో సందేహాల నివృత్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

పెనమలూరు: గోసాలలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద చెక్కును గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. గ్రామంలో ఇస్లాంపేటకు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం అమలులో ఉండడంతో తక్షణ సాయంగా మట్టి ఖర్చులకు గాను రూ.10 వేల చెక్కును మృతుడి భార్య సయ్యద్ నాజరున్నీసాబేగంకు సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, 8వ వార్డు సభ్యుడు ఎండి.ఆసిఫ్‌పాషా అందజేశారు.

పక్కా గృహాలు నిర్మించుకోవాలి

కంకిపాడు: లబ్ధిదారులు ప్రతిఒక్కరూ పక్కా గృహాలను నిర్మించుకోవాలని రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సూచించారు. కంకిపాడు పట్టణానికి చెందిన 340 మంది లబ్ధిదారులకు వేల్పూరు గ్రామ పరిధిలో జగనన్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలను కేటాయించారు. స్థలాలు కేటాయించిన లబ్ధిదారులకు మంగళవారం లే అవుట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థలాలు పొందిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందుతుందన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లు నిర్మించుకుని సొంతింటివారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు డ్వాక్రా బాసట

గన్నవరం రూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని ఏపీఎం మాధవి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ డ్వాక్రాలోని పొదుపు నుంచి రూ.35వేలు, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.35వేల నుంచి రూ.50వేలు, గృహలక్ష్మి పథకం ద్వారా రూ.35వేల నుంచి లక్ష, ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.50 వేలు వడ్డీ లేని రుణం అందిస్తున్నట్లు వివరించారు.

ఎన్‌హెచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



గన్నవరం: మండలంలోని కేసరపల్లి పరిధిలో జాతీయ రహదారిపై జరుగుతున్న సుందరీకరణ పనులను మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ సంపత్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఎన్‌హెచ్ పక్కన వరుణ్ మోటర్స్ నుంచి కేసరపల్లిలోని ఏలూరు కాలువ వరకు ఉన్న రహదారిపై అనధికార డంపింగ్ యార్డును తొలగించిన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీపీవో నాగేశ్వర్‌నాయక్, ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానికతో ఆయన చర్చించారు. విమానాశ్రయానికి అతి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఇక్కడ చెత్త, వ్యర్థాలు డంపింగ్ జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రాంతంలో మొక్కలు నాటడం ద్వారా గ్రీనరీని పెంపొందించడంతో పాటు పర్యవేక్షణ బాధ్యతలు కూడా చేపట్టాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మానిక పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళులు

రామవరప్పాడు: పుల్వామా దాడుల్లో అసువులు బాసిన వీర జవాన్లకు రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఆర్మీ క్యాడెట్లు మంగళవారం నివాళులర్పించారు. దేశ రక్షణలో తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ ఎన్‌సీసీ ఆర్మీ క్యాడెట్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కానూరులో అమరవీరులకు ఘన నివాళి

పెనమలూరు: పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన సైనికులకు మంగళవారం కానూరులో క్రీడాకారులు ఘన నివాళులర్పించారు. కానూరు మాతృహృదయ్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో అశోక్ జిమ్‌లో మంగళవారం అమరులైన 40 మంది సైనికుల ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: సమాజంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మంగళవారం కానూరు మురళీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ అందచేసి స్థానిక సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించారు. సమాజంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. పేద విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య చదువుకోవటానికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామన్నారు. వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామని వివరించారు.

కానూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నా...

కానూరు గ్రామ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. గడిచిన మూడున్నరేళ్లలో రూ.35 కోట్లు గ్రామ అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. దాదాపు 50 రోడ్లు నిర్మాణం చేశామని తెలిపారు. లబ్ధిదారులకు రూ.200 కోట్లు సొమ్ము నేరుగా గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మూడు వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. రూ.17 కోట్లతో కృష్ణా జలాలు తాగునీరుగా అందించటానికి చర్యలు చేపట్టామని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే శ్రావణ్, చాంద్‌బాషా, తాళ్ల నరేంద్ర, సిద్దిక్, ఖాదర్, శివరామకృష్ణ, తూమాటి శ్రీరాములు, నేరెళ్ల బుజ్జి, ఈదా రాజేష్, లతీఫ్, సైకం చినబాబు, రెహమాన్ పాల్గొన్నారు.

గృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



వణుకూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: వణుకూరు జగనన్న కాలనీలో ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహాలు నిర్మాణం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. వణుకూరులోని జగనన్న కాలనీ లేఅవుటులో మంగళవారం ఆయన పోరంకి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గృహాల నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని, బ్యాంకుల ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు కూడా ఇప్పిస్తున్నామన్నారు. గృహాలు లబ్ధిదారులే నిర్మాణం చేసుకుంటే నాణ్యతగా ఉంటుందన్నారు. సబ్సిడీపై ఇనుము, సిమెంట్ ఇస్తున్నామని, ఇసుక ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు కూడా పూర్తి సహకారం అందిస్తారన్నారు. సమావేశంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, తహసీల్దార్ టీవీ.సతీష్, ఎంపీడీఓ సునితాశర్మ, వైఎస్సార్ సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న నున్న హైస్కూల్ విద్యార్థినిలు



క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినిలు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తూ పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకువస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) 66వ అంతర్ జిల్లాల ఫెన్సింగ్, సైక్లింగ్ పోటీలలో హైస్కూల్ విద్యార్థులు పతకాలు సాధించగా, తాజాగా జాతీయస్థాయి మహిళల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో ఇద్దరు నున్న హైస్కూల్ విద్యార్థినిలు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి అద్భుత ప్రతిభను కనబరిచారు. దీంతో ఆంధ్రప్రదేశ్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టు ఈ ఏడాది అక్టోబర్‌లో గోవాలో జరగనున్న 37వ జాతీయ క్రీడలకు అర్హత పొందింది. ఈ టోర్నమెంట్‌లో పాఠశాల పదో తరగతి విద్యార్థినిలు లేళ్ల పూర్ణశ్రీ, తురకా దివ్య రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించగా, జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు లేళ్ళ పూర్ణశ్రీ ఎంపికైంది. ఇటీవల నరసరావుపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ 66వ అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలలో పాఠశాల పదోతరగతి విద్యార్థిని దర్శి పూజిత అండర్–19 బాలికల మాస్ స్టార్ట్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈమె ఇద్దరు జాతీయస్థాయి సైక్లిస్ట్‌లతో పోటీపడి తృటిలో రజత పతకాన్ని కోల్పోయింది. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో రాణిస్తున్న క్రీడాకారులను పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి అభినందించారు. విద్యార్థినిలను క్రీడలవైపు ప్రోత్సహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు ముత్యాల వెంకటేశ్వరరావు, టి.విజయవర్మలను అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ కామినేని కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనానికి సైక్లింగ్ దోహదం



ఈడుపుగల్లులో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, విద్యా, వైద్యశాఖ అధికారులు



పెనమలూరులో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



ఆత్కూరులో సైక్లింగ్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీపీ సరోజిని



నున్నలో క్యాన్సర్ నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరోగ్యకర జీవనం కోసం ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ 'సైకిల్ ఫర్ హెల్త్' కార్యక్రమంలో భాగంగా హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వైద్యారోగ్య సిబ్బంది సైకిళ్లపై ర్యాలీగా ప్రధాన కూడలికి చేరుకున్నారు. జంక్షన్ సెంటర్‌లో సైక్లింగ్ చేస్తూ నినాదాలు చేశారు. ఎంపీపీ నగేష్ మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల మానసిక ఒత్తిడి, వేదన తగ్గుతాయని, అధిక బరువు సమస్య ఉండదని చెప్పారు. సైక్లింగ్ చేయటం వల్ల పలు ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజూషా తెలిపారు. డయాబెటిక్, అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటాయని, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. సర్పంచ్ సరిపల్లి కమలా బాయి, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, సీహెచ్‌వో ఎన్.ఫణికుమార్, ఎంపీహెచ్‌ఎస్ ఎంవీ అప్పారావు, హెల్త్ అసిస్టెంట్లు జి.నాగరాజు, తొమ్మండ్రు పండు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గన్నవరంలో సైకిల్‌థాన్ ర్యాలీ

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం సైకిల్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. ముస్తాబాద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత ఈ ర్యాలీని గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వాకింగ్, సైక్లింగ్, యోగా చేయాలని తెలిపారు. దీనివల్ల బీపీ, షుగర్, క్యాన్సర్, థైరాయిడ్ వంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైక్లింగ్ చేద్దాం..ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ వ్యాయామం, సైక్లింగ్ చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలోని పెద అవుటపల్లి, ఉంగుటూరు, ఇందుపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. బీపీ, షుగరు, గుండె జబ్బులు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయాలని వైద్యులు తెలిపారు. ఆత్కూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీతో పాటు ఎంపీడీవో శేషగిరిరావు, ఆయా గ్రామాల సర్పంచులు, పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో మంచి ఆరోగ్యం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని వైద్యాధికారి శివప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజూ సైకిల్ తొక్కటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని చెప్పారు. వాయు కాలుష్యం ఉండదన్నారు. ఆరోగ్య రక్షణకు, ప్రజారోగ్య పరిరక్షణకు సైక్లింగ్ చేయాలన్నారు. ఆయుష్ వైద్యులు పి.శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన అవసరం

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మండల వైద్యాధికారి బి.శ్రీనివాస్ అన్నారు. పెనమలూరు గ్రామంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించటానికి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన ఉండాలని, మంచి పోషకాహారం తీసుకోవాలని, అపోహలు, అనుమానాలు తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎలమంచిలి దుర్గాభవాని, సీహెచ్‌వో డి.కుమార్, పీహెచ్‌ఎస్ లక్ష్మి, సూపర్‌వైజర్లు కె.పద్మావతి,ం రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ

కంకిపాడు: వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు గ్రామంలో మంగళవారం సైకిల్ థాన్ ర్యాలీ చేపట్టారు. స్థానిక జెడ్పీ పాఠశాల నుంచి చేపట్టిన ర్యాలీ ప్రధాన గ్రామంలో సాగింది. ఎంపీపీ రాజ్యలక్ష్మి ర్యాలీని ప్రారంభించారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ బీపీ, షుగరు, గుండె జబ్బులు, క్యాన్సర్, ఇతర అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించడమే సైకిల్ థాన్ ర్యాలీ ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుందర్ కుమార్, ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు తాడేపల్లిలో సైకిల్ ర్యాలీ

విజయవాడ రూరల్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కోసం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో మంగళవారం విద్యార్థులతో సైకిల్ ర్యాలీ, యోగ, హెల్త్‌మేళా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధురిదేవి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణమైన పొగాకు, గుట్కా, మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని ప్రజలకు సూచించారు. విద్యార్థులు, వైద్యసిబ్బంది ప్లకార్డులతో క్యాన్సర్ వ్యాధి నిర్మూలన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నున్నలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ

నున్న(విజయవాడరూరల్): మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని వెలగలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవికాంత్ అన్నారు. నున్న గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి చెరువుసెంటర్ వరకు క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీతో పాటు యోగ కార్యక్రమాలను నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు లక్ష్యం

సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్



ఉప్పలూరు బాంచి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్

కంకిపాడు: ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలే తమ లక్ష్యమని సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో బ్యాంకు నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఖాతాదారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరికీ ఉపయుక్తంగా బ్యాంకు సేవలను అందుబాటులోకి తెస్తున్నామని, బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, బ్యాంకు విజయవాడ రీజియన్ మేనేజర్ జె.రామకృష్ణ, గుడివాడ ఆర్‌ఎం ఎన్.బ్రహ్మయ్య, కేసీపీ జీఎం వి.వి.పున్నారావు, బ్రాంచ్ మేనేజరు ఏవీఎస్‌వీఎన్ పార్థు, మంతెన బ్రాంచ్ మేనేజర్ పి.రమేష్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజనంలో చికెన్ పలావు



విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పీఎస్‌ఆర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులు 150 మందికి మంగళవారం మధ్యాహ్న భోజనంలో భాగంగా చికెన్ పలావు వడ్డించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలు కూడా అభివృద్ధి చెందటంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సచివాలయం-4 కన్వీనర్ మాదసు జమున తెలిపారు. -రామవరప్పాడు

● వీరమ్మ తల్లీ.. కరుణించమ్మా!



పొట్టేళ్ల ప్రభ బండి ఊరేగింపును ప్రారంభిస్తున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ఉయ్యూరు వీరమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

కంకిపాడు: మహిళలు స్వయంశక్తితో ఎదగాలని బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డి.నాగరాజకుమార్ అన్నారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లో బీఐఆర్‌ఈడీ సౌజన్యంతో శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం, జర్దోసీ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. నాగరాజకుమార్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈడే శివనాగలక్ష్మి, రైల్వే చీఫ్ ఆఫీసర్ కె.రాంబాబు, ఐఓబీ చీఫ్ మేనేజర్ నేరెళ్ల అపర్ణాదేవి, యుబీఐ చీఫ్ మేనేజర్ హరిత, ఎస్‌బీఐ మేనేజర్ దంతేశ్వరరావు, సత్యసాయి సేవాసమితి కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల అధ్యక్షులు పీఆర్‌ఎల్ ప్రసాద్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అన్యాక్రాంతానికి గురైన వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

రామవరప్పాడు: గత టీడీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతానికి గురైన ముస్లిం మైనార్టీల వక్ఫ్ ఆస్తులను కాపాడి స్వాధీనపరుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ముస్లిం రైట్స్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ మైనార్టీలకు సంబంధించిన వక్ఫ్ భూముల పరిరక్షణలో భాగంగా ఇటీవల విశాఖ నగరంలోని హజ్రత్ సయ్యద్ ఆలీ ఇషాక్ మదని దర్గాను సందర్శించినట్లు వివరించారు. ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్ భూములు ఈ దర్గా మాన్యంలో ఉన్నాయని, ఇందులో ఎక్కువ భాగం అన్యాక్రాంతానికి గురయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన విచారణ జరిపి ఈ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని వీటిని స్వాధీనపరుచుకోవాలని కోరారు.

తల్లీకొడుకు అదృశ్యం

కంకిపాడు: తల్లీ కొడుకు అదృశ్యమైన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన తండాని సాయిలక్ష్మి (27), ఆమె కుమారుడు ప్రవీణ్ (5) ఈనెల 9వ తేదీ ఉదయం నుంచి కనిపించటం లేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సాయిలక్ష్మి తల్లి నక్కాని ధనలక్ష్మి కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి పరీక్షలు

గుడివాడటౌన్: దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి గురువారం పరీక్షలు నిర్వహిస్తామని సమగ్రశిక్ష గుడివాడ యూనిట్ నిర్వాహకులు నీలాంబ్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు జరుగుతాయన్నారు.

సరోజినీనాయుడు ఆదర్శనీయురాలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ కళాశాల విశ్రాంత సూపరింటెండెంట్ సత్యవతి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణిని వాకర్లు సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి, కోశాధికారి గంపా సాంబశివరావు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

పెనమలూరు: యనమలకుదురులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఉమాశంకర్‌నగర్‌కు చెందిన పీతా రాంబాబు(62) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతను తన ఆఫీసు యనమలకుదురు వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసుకుని వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తాడు. మంగళవారం పొద్దుపోయిన తరువాత తాడిగడప డొంక రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రత్తయ్య రైస్ మిల్లు వద్ద తాడిగడప నుంచి అతి వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కానూరులో బాలిక అదృశ్యం

పెనమలూరు: కానూరులో బాలిక అదృశ్యం కావటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు తోటలకు బాలిక (17) ఇంటర్ చదివి ఇంట్లోనే ఉంటుంది. సోమవారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవటంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.